# 6 పాఠ్య బోధనకు భాషోపాధ్యాయుడు ఎలా తయారుకావాలి?

© SCERT not to be republished

యుద్ధానికి వెళ్ళే సైనికుడు అవసరమైన ఆయుధాలతో రణక్షేత్రంలోకి దూకుతాడు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుడు అవసరమైన పరికరాలతో మైదానంలోకి దిగుతాడు. సైనికుడు యుద్ధం జరిగినప్పుడు కూడా ఆయుధాలకు మెరుగుపెట్టుకుంటూ దాని పదునును పరీక్షిస్తుంటాడు. క్రీడాకారుడు పోటీలు లేనప్పుడు కూడా సాధన చేస్తూనే ఉంటాడు. వీళ్ళిద్దరూ నైపుణ్యాలు పెంచుకునే ప్రయత్నంలో ఉంటూ విజయాలకోసం ఉవ్విళ్ళూరుతుంటారు. మరి వాళ్ళను తీర్చిదిద్దే శిక్షకుడు మరెంతగా సంసిద్ధుడై ఉంటాడో కదా! అలాగే మనమీద ఎంతో నమ్మకంతో తమ పిల్లవాడి భవిష్యత్తును మన చేతుల్లో పెట్టిన తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టడానికి ఉపాధ్యాయుడిగా మనమెలాంటి శిక్షణ పొందాలి? ఎలా తయారుకావాలి? పాఠశాల విద్యలో మనమందరం వేసుకోవాల్సిన కీలకమైన ప్రశ్నలు ఇవి – తమ వృత్తిధర్మానికి ఎంతమేరకు న్యాయం చేకూరుస్తున్నామని ఆత్మవిమర్శనాత్మకంగా విశ్లేషించుకోవలసిన పరిస్థితిలో నిలబడింది మన ఉపాధ్యాయ లోకం!

1. *పాఠ్యబోధనకు తయారుకావడం అంటే ఏమిటి?*
2. *భాషోపాధ్యాయుడు ఏ ఏ అంశాల్లో తయారుకావాలి?*
3. *తయారుకావడం ఎందుకు?*

ఈ నేపథ్యంలో భాషోపాధ్యాయుడి బరువు బాధ్యతలు మరింత పెరిగాయి. డిగ్రీ స్థాయికి వచ్చిన విద్యార్థి తెలుగు చదవడంలో తడబడుతున్నాడు. రాతలో అనేక భాషాదోషాలు దొర్లుతున్నాయి. కనీస భావప్రకటనా సామర్థ్యం లేక పోటీ ప్రపంచంలో వెనకబడిపోతున్నాడు. తన వెనకబాటుతనానికి కారణం ఎవరు అని వెనకకు చూసుకుంటే ప్రాథమిక పాఠశాల స్థాయిలో భాషను బోధించిన ఉధ్యాయుడు కనిపిస్తాడు. ఇది నిజంగా నమ్మలేని చేదునిజం. ఎందుకంటే పాఠశాల విద్యలో కీలకమైన వ్యక్తి ఉపాధ్యాయుడు. అందులో పిల్లలపై అమితమైన ప్రభావాన్ని కలగజేసేవారిలో భాషను బోధించే ఉపాధ్యాయుడి పాత్ర శక్తివంతమైనది. సహజవాతావరణంలో పెరుగుతూ వినడం, మాట్లాడడం నేర్చుకునే పిల్లలు పాఠశాలలో ప్రవేశించగానే వారిలో పలు గుణాత్మక మార్పులను గమనించవచ్చు. ఇవన్నీ భాషకు సంబంధించినవే కావడం గమనార్హం. పిల్లవాడి తరగతి పెరుగుతున్న కొద్దీ అతడి ఆలోచనాత్మకత విస్తరిస్తుంది. అనేక సందేహాలను మోసుకొస్తాడు. ఎన్నో ప్రశ్నలను సంధిస్తాడు. అతడిలో ఊహాశక్తి, సృజనాత్మకత పురివిప్పుతుంది. ఈ సందర్భంలో ఒక ప్రాథమికోన్నత మరియు సెకండరీ స్థాయిల్లోని భాషోపాధ్యాయుడే కీలకమైన ఆధారంగా కనిపిస్తాడు. మట్టిలోంచి విత్తనం మొలకెత్తినప్పుడు ఆదృశ్యం ఎంతో అపురూపంగా ఉంటుంది. ఆ మొలకలను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటాం. అంత అపురూపంగా, జాగ్రత్తగా చూసుకోవాలి ఆ పిల్లవాడిని. అందుకే భాషోపాధ్యాయుడు నిరంతరం జాగరూకతతో నిత్య విద్యార్థిగా, అధ్యయనశీలిగా, తన జ్ఞాన పరిధిని విస్తృతపరచుకుంటూ చైతన్యవంతుడిగా ఉండాలి. ఆ క్రమంలో భాషోపాధ్యాయుడు ఈ విధంగా తయారుకావాలి.

భాషోపాధ్యాయుడు మొట్టమొదటగా చేయవలసిన నిరంతర అధ్యయన కార్యక్రమం ఒకటుంది. భాషోపాధ్యాయ ఉద్యోగం కోసం రేయింబవళ్ళు అనేక పుస్తకాలు, విషయవిస్తృత సామగ్రి చదివి ఈ ఉన్నతస్థాయికి చేరుకున్నాం. ఇంతటితో చదవడం అనే పని ముగిసిపోలేదు. ఇక్కడి నుండే విభిన్నమైన పుస్తకాలతో విస్తృతమైన పఠనం మొదలుకావాలి. సాహిత్యాభిరుచిని పెంపొందించుకోవాలి. జ్ఞానసంపదను పెంచుకోవాలి. ఉన్నతమైన వైఖరిని అలవరచుకోవాలి. సామాజిక స్పృహలో మానవతా విలువలను, మానవ సంబంధాలను అభివృద్ధిపరచుకోవాలి. ఏ విషయంలోనైనా ఒక్క పిల్లవాడి దృష్టిలోనేకాదు సమాజంలో తమదైన అస్తిత్వంతో గౌరవాభిమానాలు దక్కుతాయి. అందులోంచి వచ్చే సంతృప్తికి, అనుభూతికి వెలకట్టలేం!

> ఇటీవల SCERT వారు నూతన తెలుగు పాఠ్యపుస్తకాల అమలు అవగాహన తీరుతెన్నులపై ఒక సర్వే నిర్వహించారు. అందులో భాగంగా భాషాబోధకలను కొన్ని ప్రశ్నలు అడిగారు. అవి పాఠ్యపుస్తకంలో 1. “పాఠాలు ఇతివృత్తాల కనుగుణంగా ఉన్నాయా?', 2. 'అన్ని ప్రక్రియల్లో పాఠాలున్నాయా?', 3. 'సూచనలను పిల్లలు అర్థం చేసుకుంటున్నారా?' ఈ ప్రశ్నలకు చాలామంది భాషోపాధ్యాయులు 'ఇతివృత్తం' 'ప్రక్రియ' 'సూచన' అంటే ఏమిటి? అని తిరిగి ప్రశ్నించారు. ఇలా చెప్పడానికి ప్రధానకారణం అధ్యయన లోపం.

✦ భాషోపాధ్యాయుడు తయారుకావడంలో అనుసరించవలసిన క్రమం :

- ఎనిమిది, తొమ్మిది తరగతుల ప్రారంభంలోనే పిల్లలందరూ చదవడం - రాయడం చేయగలరా లేదా అని నిర్ధారించుకోవాలి.
- చదవడం - రాయడంలో వెనకబడిన పిల్లలకు మూడు వారాలపాటు చదవడం, రాయడం అభ్యాసం చేయించాలి.
- పిల్లలో పఠనాశక్తి కలిగించడానికి బాలసాహిత్యం తరగతిగదిలో అందుబాటులో ఉంచాలి.
- మౌన పఠనం ద్వారా భావాన్ని గ్రహించే అలవాటు చేయాలి.
- పాఠ్యాంశాలు చదవడం, అర్థం చేసుకోవడం గురించి తరగతి గదిలో జట్టు కృత్యాలు, వ్యక్తిగత కృత్యాలు నిర్వహించాలి.
- పిల్లలు పద్యాలను కంఠస్థం చేయడంతోపాటు రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలిగేలా శిక్షణ ఇవ్వాలి.
- ఏపాఠమైనా పిల్లలచే వ్యక్తిగతంగా మొదట చదివించాలి. కొత్తపదాలను గుర్తించేలా చేసి వాటి అర్థాలకోసం నిఘంటువును పరిశీలించమనాలి.
- తరగతి గదిలో పాఠ్యాంశాల గురించి చర్చించడం, అభిప్రాయాలు చెప్పడం, పిల్లలు వాటిపై ప్రతిస్పందించడం బోధనాభ్యసన ప్రక్రియలో భాగం చెయ్యాలి.
- పాఠ్యాంశాల్లోని సమాసపదాలు, జంటపదాలు గుర్తించి వాటిని విడదీయడం, కలపడంలో మధ్య వచ్చే మార్పులను చర్చద్వారా అవగాహన చేయించాలి.
- పాఠ్యాంశాల కింద అభ్యాసాలు సొంతంగా చేయించడం, వాటి గురించి చర్చించడం జరిగేలా చూడాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల్లో ముఖ్యంగా పాత్రపోషణ, నాటకీకరణ, మూకాభినయం, చిత్రాల ద్వారా వ్యక్తీకరణ చర్చలు, సంవాదాలు, పత్రికా క్లిప్పింగులు మొదలగునవి చదవడం, వాటిపై చర్చించడం తప్పనిసరిగా నిర్వహించాలి.
- పిల్లలచేత వారి నోటుపుస్తకాలలో సొంతంగా రాయించడం, పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలను సొంతంగా రాయించడం చేయాలి.
- ప్రతిరోజూ తాము చదివిన, విన్న, చూసిన అంశాల గురించి, పాఠశాలలో అనుభవాల గురించి తమ డైరీలో పిల్లలతో రాయించాలి.

✦ భాషోపాధ్యాయుడి విధులు - బాధ్యతలు :

- 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి.
- పాఠ్యపుస్తకంలోని ముందుమాట, ఉపాధ్యాయ సూచనలను ప్రత్యేకంగా అవగాహన చేసుకోవాలి.

- అన్ని పాఠ్యాంశాలను పాఠాలవారీగా, యూనిట్లవారీగా, వార్షిక పథకాలుగా తయారుచేసుకోవాలి.
- పద్యభాగానికి చెందిన పాఠాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలగాలి. పిల్లలతో అభ్యాసం చేయించాలి.
- గద్యభాగంలోని పాఠ్యాంశాలను తామే వివరించకుండా పిల్లలచేత చదివింపజేయడం, చర్చింపజేయడం వాటి సారాంశం చెప్పించడం, వర్ణనాత్మకంగా మాట్లాడించడం చేయాలి. ఒక రూపం నుండి మరొక రూపంలోకి మార్చడం వంటి కృత్యాలను నిర్వహించాలి.
- భాష, భాషాధ్యయనం గురించిన పూర్వజ్ఞానం పిల్లల్లో ఉంటుంది కాబట్టి వాక్యనిర్మాణం, రచనాశైలిపట్ల వారికి అవగాహన కల్పించాలి.
- పిల్లలకు ఇంటిపని పేరుతో చూసిరాసే అభ్యాసాలకు బదులు వారు సొంతంగా రాసేలా ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై స్వీయరచనా అభ్యాసం కల్పించాలి.
- పిల్లలు స్వయంరచనలలో తమమాటల్లో, సమాధానాలు మరొక పిల్లవాడి సమాధానానికి భిన్నంగా ఉండాలి.
- మార్కెట్లో లభ్యమయ్యే గైడ్లు, ప్రశ్నానిధులు, స్టడీమెటీరియల్స్ వంటి వాటిని పిల్లలు ఉపయోగించకుండా చూడాలి.
- పిల్లల నోటుబుక్కులను యాంత్రికంగా చూడకుండా వారు రాసిన విధానం గురించి ఆ నోట్‌బుక్కులలో రిమార్కులు రాయాలి. తేదీతో సంతకాన్ని చేయాలి.
- సొంతంగా ప్రశ్నాపత్రాలను తయారుచేసుకొని పరీక్షలు నిర్వహించాలి.
- పిల్లల ప్రగతిపత్రంలో గ్రేడింగ్ నమోదుచేసి పిల్లల తల్లిదండ్రులతో సంతకాలు చేయించాలి.
- సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి. పునఃసమీక్ష చేయాలి.

✦ సమర్థమైన బోధనకు సమకూర్చుకోవలసిన సామగ్రి.

- పాఠ్యాంశాలకు సంబంధించిన మూలగ్రంథాలు.
- పాఠ్యాంశకవులు, రచయితలు, రచనలు సాహిత్య పరామర్శ గ్రంథాలు.
- నిఘంటువులు, సాహిత్య పత్రికలు, దినపత్రికలలో, ఆదివారం అనుబంధాలలో వివిధ మ్యాగజైన్‌లలో వచ్చే సాహిత్య, భాషాసంబంధ పేజీలు.
- తరగతి గది గ్రంథాలయ పుస్తకాలు, బాలసాహిత్యం.
- పండుగల విశిష్టతలు తెలిపే గ్రంథాలు.
- సంస్కృతి సంప్రదాయాలపై వచ్చిన గ్రంథాలు.
- దర్శనీయ స్థలాలు, స్థలాల గొప్పదనం వివరించే పుస్తకాలు.
- ప్రముఖుల జీవిత చరిత్రలు.
- ప్రామాణికమైన వ్యక్తిత్వ వికాస గ్రంథాలు.
- వివిధ భాషల్లోని ప్రముఖ గ్రంథాలు.
- టీవి, డి.వి.డి., టేప్‌రికార్డర్, రేడియో.

✦ (ఎలక్ట్రానిక్ మీడియా) ఆధునిక సాంకేతిక ప్రసార సాధనాలు.

- వివిధ టెలివిజన్ ఛానళ్ళలో వచ్చే భాషా, సాహిత్య కార్యక్రమాలు.
- ఇంటర్‌నెట్‌లోని తెలుగుసాహిత్య వెబ్‌సైట్లు, బ్లాగులు, e-పత్రికలు.
- యూట్యూబ్‌లో ఉండే తెలుగు భాష, సాహిత్య కథనాలు.

© SCERT not to be republished

- సప్తగిరి ఛానెల్‌లో ప్రసారమయ్యే భాషా సాహిత్య ప్రత్యేక కార్యక్రమాలు.
- ప్రముఖ కవులు, రచయితలు ముఖాముఖి కార్యక్రమాలు.
- మార్కెట్‌లో దొరికే పాటలు, సాహిత్య సీ.డీ.లు.

✦ భాషోపాధ్యాయుడు పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ చూపాల్సిన అంశాలు.

- బడిబయట పిల్లలు పాఠశాలలో వయసుకి తగిన తరగతులలో చేరినప్పుడు వారికి ప్రత్యేక సామగ్రి సహాయంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.
- తరగతిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చెందిన ఉపకరణాలు, సౌకర్యాలు అందుబాటులో ఉండాలి.
- తరగతి గదిలో బహుభాషా వాతావరణం ఉంటుంది. కాబట్టి పిల్లలను వారివారి మాతృభాషల్లో మాట్లాడడం ద్వారా తెలుగుభాషతో పోల్చడం సారూప్యతను గుర్తింపజేయడం జరగాలి.
- పిల్లలు తమ సొంత శైలిలో మాట్లాడడాన్ని, పాడడాన్ని ప్రోత్సహించాలి.
- పిల్లల్లోని సృజనాత్మక శక్తిని, కళాభిమానాన్ని గుర్తించి వారిని ఆయా కళల్లో ఎదిగేటట్లుగా సూచనలు చేస్తూ ప్రోత్సహించాలి.
- పాఠ్యాంశాల ఇతివృత్తాంతాల కనుగుణంగా సామాగ్రిని – అంశాలను సేకరించడం, రాయడం వంటి ప్రాజెక్ట్ పనులను నెలకు ఒకటి చొప్పున పిల్లలకిచ్చి వీటి నివేదికలను తరగతిగదిలో ప్రదర్శించాలి.
- పిల్లలు రాసిన కవితలు, కథలు, గేయాలు, జోకులు వ్యాఖ్యలు మొదలైనవాటిని గోడపత్రికలో ప్రదర్శించాలి.

ఇటీవల SCERT వారు కొన్ని పాఠశాలల్లో తెలుగు పాఠ్యాంశ బోధన ఎలా జరుగుతుందనే పరిశీలనకు నేరుగా తరగతిగదిలోకే వెళ్ళారు. ఒక పాఠశాలలో భాషోపాధ్యాయిని టేబుల్ మీద పాఠ్యపుస్తకం, గైడ్ పక్కపక్కనే పెట్టుకుని పాఠం చెబుతూ కనిపించారు. పిల్లలు గైడ్స్ ఉపయోగించకుండా చూడాలన్న మనమే ఇలాంటివి చేయడం సమంజసమేనా?

✦ ముగింపు

పైన పేర్కొన్న విషయాలన్నిటిని అనుసరిస్తూ, సామగ్రిని సమకూర్చుకుని భాషోపాధ్యాయుడు తరగతి గదిలో కర్తవ్యం నిర్వహిస్తే ఒక అద్భుతాన్ని ఆవిష్కరించవచ్చు. నాలుగుగోడల తరగతి గదిలోంచి ఒక సరికొత్త రేపటి తరానికి ఊపిరిలు ఊదవచ్చు. ముఖ్యంగా పిల్లలు ఉన్నత విద్యాస్థాయి ప్రమాణాలను అందుకోవడంలో మాతృభాష కీలకమైన సాధనం. మాతృభాషలో సాధించిన జ్ఞానం, విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సానుకూల దృక్పథంలో మిగతా విషయాల పట్ల ఆసక్తి, శ్రద్ధ పెరుగుతాయి. విద్యార్థులు విషయ తీవ్రతతో కూడిన అధ్యయనానికి, అవగాహనకు స్పష్టమైన పునాదులు నిర్మించుకుంటారు. తమ అత్యుత్తమ భవిష్యత్ విద్యాసౌధానికి, సమగ్ర మూర్తిమత్వానికి నిర్మాణాత్మకమైన బాటలు వేసుకుంటారు. ఆ ఉత్తమ మార్గంలో భాషోపాధ్యాయుడు ఒక విశ్వసనీయమైన, ప్రామాణికమైన దిక్సూచిగా, దీపస్తంభంగా నిలబడుతాడు. నిజంగా భాషోపాధ్యాయుడిది ఎంత అదృష్టం. ఆ అదృష్టమార్గంలోకి వెళ్ళడానికి తయారవుదాం రండి!

© SCERT not to be republished